# నచ్చని అందం

"అసలు నన్నడిగితే పెళ్ళికూతుర్ని ఎంచుకోవడం అన్నది యింత హంగామాతో జరగాల్సిన అవసరం లేదంటాను. పనీపాటూ చక్కగా తెలిసి సంసారపక్షంగా వుండి కురూపికాని అమ్మాయిని ఎంచుకోగలిగితే చాలు. అందంలో పందెంవేసే రంభే కావాలంటే ఎలా!.... అది గుర్తించకుండా పెళ్ళి చూపులన్న తతంగం నానాటికీ వెర్రితలలేస్తోంది. చదువుకున్న వాళ్ళయినా దీన్ని సరిదిద్దడం అవసరం." అని ప్రతిపాదించి గడ్డిమీద గుద్దాడు నారాయణరావు — మిత్ర బృందం సమాలోచన కొంతవరకు జరిపాక.

"నీ మొహం....వెధవ కన్సొలేషను మాటలు మాట్లాడబోకు. అందరూ నీకుమల్లె కళ్ళుమూసుకుని పిల్లని ఎంచుకోమంటావ్! మన

బ్యాచిలో బ్రహ్మచారిగా వుండిపోయింది ఉమామహేశంగాడొక్కడే. వాడు మంచి డిమాండులో వున్నాడు. పెళ్లిచూపులికి వాడి రెండు కళ్ళు చాలడం లేదు...." సాంబమూర్తి చెప్పదలచుకున్న విషయందాకా రాక ముందే భూపతి అడ్డుపడ్డాడు "నీకున్న ఒకటిన్నరలో అరకన్ను ఎరువివ్వకపోయావ్" అంటూ.

మిత్రులంతా గొల్లుమని నవ్వారు.

"ఒరేయ్! భూపతీ, మన సాంబన్న మెల్లకంటిని అంత తేలిగ్గా అరకింద కట్టేశావేగాని అది ఎంత అదృష్ట సూచకమో ఎప్పుడన్నా ఆలోచించావా? వాడి మామకి యిద్దరుకూతుళ్ళు. మనవాడే పెద్దల్లుడు- సగం ఆస్తి కొట్టేస్తాడు లక్కీఫెలో. ఇక మన సంగతి చెప్పుకోవడం ఎందుకులే!" అని సాంబమూర్తికి వత్తాసుగా మాట్లాడాడు నారాయణ రావు.

సాంబమూర్తి లోలోపల సంతోషించాడు.

అసలు విషయం వదిలిన మిత్రుల్ని మందలిస్తూ నారాయణరావు "నే అన్న సంగతి ఎవరికీ అర్థం అయినట్లు లేదు. ఒకవేళ అర్థమయినా దానిమీద ఏం మాట్లాడాలో తోచక వూరుకున్నారో!.... సరే నా అభిప్రాయం వినండి" అన్నాడు.

"కానీండి ..." అన్నాడు సాంబమూర్తి దగ్గరగా జరుగుతూ సీరియస్‌గా వినేవాడిమాదిరి.

"నేను మొదట్లో అన్నట్లు పిల్లను ఎంచుకోవడానికి మన ఉమా మహేశం అంత అతలాకుతలం అవ్వనక్కర్లేదు. అందమైన యువతి తన అర్ధాంగి కావాలని ప్రతి యువకుడు కోరుతూనే వుంటాడు. వైస్ వర్సా—అంతే. అందానికి అంతం లేదు. యాతా వాతా పిల్ల నచ్చడం అంటూ ఒకపట్టాన జరగదు. రంభలాంటి పిల్ల కావాలనుకుంటాడు. అందులో అసహజం ఏమీలేదు. కాని విషయజ్ఞులు "భార్యా రూపవతీ శత్రుః" అన్నారు మరి. ఇది అన్ని సందర్భాల్లోనూ సత్యం కాదని

ఒప్పుకోవాల్సిందే. కాని, రూపవతి అయిన భార్య ఎంత గుణవతి అయినా భర్తకు ఆమె అందంవల్ల మనోవేదన కలిగే కేసులు లేక పోలేదు. జీవితంలో కేవలం అందంవల్లనే ఆనందం రాదు" ఉపన్యాస ధోరణిలో నడుస్తోంది.

సాంబమూర్తికి అంతుపట్టక "నారాయణా! నువ్వు చెప్పదలచు కున్న పాయింటు సూటిగా చెప్పు. అట్టే వెర్రిమొర్రి వాగుడుమాని" అని హెచ్చరించాడు.

"అదేనోయ్, నన్ను చెప్పనిస్తేనా?.... నే చెప్పేది చాలా డెలికేట్ పాయింట్, ఫాలో కాకపోతే అసలు విషయం తెలియడం కష్టం. మన ఉమామహేశంగాడు రీసెంటుగా గుడివాడ పెళ్ళిచూపులికి వెళ్ళి వచ్చాడు. ఆ అమ్మాయికి ఏమీ వంకలు లేకపోయినా మనవాడు "యస్" అనలేదు. ఇదివరకు అలాంటివి ఎన్ని అయ్యాయో! తిరిగి ఎల్లుండి బెజవాడ వెళ్ళబోతున్నాడు. కాలం గడిచిపోతోంది. ఎంతకాలమని బ్రహ్మచారిగా వుంటాడు? చదువు పూర్తయింది. ఉద్యోగం దొరికింది. లైఫ్‌లో ఒక విధంగా సెటిలయ్యాడు. త్వరలో ఒక యింటివాడవడం ధర్మం. ఏదో సంసారపక్షంగా వున్న పిల్లను చేనుకోవాలి. పిల్ల తెలివి తేటలు, గుణగణాలు కూడ ముఖ్యం రూపంతోపాటు. కాబట్టి ఈ సంగతి దృష్టిలో వుంచుకుని త్వరలో ఏదో సంబంధం ఒప్పుకోమంటాను మన ఉమామహేశాన్ని." అని ముగించాడు నారాయణరావు.

ఉమామహేశం ఏమీ మాట్లాడలేదు.

భూపతి జేబులోనుంచి వక్కపొడి పొట్లం ఒకటి తీసి నారాయణ రావుకు అందిస్తూ "కొంచెం నోట్లో వేసుకోరా పాపం నాలిక పిడచగట్టుకు పోతుంది తెగవాగుతున్నావ్" అన్నాడు.

మిత్రులు తలో పలుకు నోట్లో వేసుకున్నారు.

ఉమామహేశం మాట్లాడక పోవడం చూసి నారాయణరావు మళ్ళీ అందుకున్నాడు: "నే అన్న మాటలు బాగా ఆలోచించండి. ఉమా

మహేశం గాడికి ఎటూ తోచడంలేదు. వాడి పెళ్ళిచూపుల విషయంలో మన సలహా ఏమిటని మీరనుకోవచ్చు. మనం వాడికన్నా కొంచెం అనుభవం పొందిన వాళ్ళం. ఈ ధక్కా మొక్కీలన్నీ తిన్నవాళ్ళం. వాడు కూడా సంసారంలో పడాలంటే ఏదో ఒక సంబంధాన్ని ఒప్పుకోవాలి. ఏరా ఉమామహేశం ఏమంటావురా?"

ఉమామహేశం చిరునవ్వు నవ్వాడు. అతను ఏమంటాడో వినాలని మిత్రులకు కుతూహలంగా వుంది. "నిజమేరా నువ్వు చెప్పింది. అమ్మా నాన్నా ఒకటే తొందర పడుతున్నారు. వాళ్ళింతవరకు నా మీదవుండే వాత్సల్యంవల్ల నాకు నచ్చిన పిల్లనే చెయ్యాలని నా నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. ఆ గౌరవం దక్కించుకోవాలంటే ఎక్కువగా పెళ్ళి చూపుల పేరుతో వాళ్ళని యిబ్బంది పెట్టకూడదు" అని మనస్సు విప్పి చెప్పాడు ఉమామహేశం.

"నువ్వు అదృష్టవంతుడివిరా ఉమామహేశం! ఆ అవకాశం నీకిచ్చారు మీ వాళ్ళు. నాకు మావాళ్ళు దాదాపు అంతా ఫైనల్ చేసి నామ్‌కే వాస్తే నన్నడిగారు. మన భూపతి గాడికి మేనరికం. ఇకపోతే నారాయణ మాత్రం పెళ్ళిచూపుల కథ ఏదో కొంత నడిపినట్టున్నాడు. ఏరా నారాయణా?" అని ప్రశ్నించాడు సాంబమూర్తి.

"ఆ పాత గొడవలన్నీ ఎందుకురా? అయితే చూసింది ఒకటే సంబంధం, వెంటనే సరేనన్నాను. నే చెప్పాగా నా పాలసీ" అని జవాబిచ్చాడు.

"అన్నట్టు ఎల్లుండి ఆదివారమే కదురా నువ్వు బెజవాడ వెళ్ళడం పెళ్ళిచూపులికి?" అని వాకబు చేశాడు సాంబమూర్తి.

"అవున్రా, ఎల్లుండే. ఈ సంబంధమన్నా ఔననకపోతే నాన్నకి నా మీద కోపం రావచ్చు. పిల్లను నిర్ణయించుకునేందుకు నాకిచ్చిన అవకాశాన్ని వుపసంహరించుకోవచ్చు. మొన్న గుడివాడలో చూసిన పిల్లను తప్పకుండా ఒప్పుకుంటానని అందరూ అనుకున్నారు. నామటుకి

నేనే అనుకున్నాను ఒప్పుకుంటాను కాబోలని. కానీ ఒప్పుకోలేదు. ఎన్నడూ నన్ను మందలించని అమ్మకూడా నన్ను మందలించింది. "అదేవిట్రా నాయనా! లక్ష్మీదేవి కళగల చక్కని పిల్ల. మాటామంతి లోనూ, ఇంటి పనుల్లోనూ మంచి నేర్పరి. సంప్రదాయం గల మంచి అమ్మాయి నచ్చలేదంటావ్!" అని. నిజమే. ఆ పిల్ల సంసార పక్షంగా బాగానేవుంది. వంక లేమీ లేవు. అయిందేదో అయిపోయింది. నేను "నో" అన్నాను" అని పూరుకున్నాడు, ఉమామహేశం.

ఇంతలోకే హుటాహుటిగా వచ్చాడు శంకరం అక్కడికి. మిత్రు లందరూ అతణ్ని "బులెటిన్ శంకరం" అంటారు. వచ్చీ రావడంతోనే "ఓరి మీ తస్సాదియ్యా? మీరు నలుగురూ ఇక్కడే చేరార్రా, అదేవిట్రా అంతా మూగనోముపట్టి కూర్చున్నారు? అని ప్రశ్నించాడు.

"మేం మాట్లాడుకోవడం ఇప్పుడే అయిపోయిందిలే. అయినా, నువొచ్చాక మేం మాట్లాడే దేముంటుందిలే? తాజావార్త లేమన్నా వున్నాయా?" అని కుతూహలంతో అడిగాడు భూపతి.

తక్కిన మిత్రులక్కూడా తాజావార్తలు వినాలని వుత్సాహంగా వుంది. శంకరం వచ్చింది తాజావార్తలు అందించడానికే. అందులో ముఖ్యమైన మిత్రులందరూ ఒకేచోట వున్నారు. అందుకు సంతోషిం చాడు.

"డియర్ ఫ్రండ్స్!" అని మొదలు పెట్టాడు.

"నీ మొహంలే, సరిగ్గా మాట్లాడు. చెప్పేదేదో మామూలు భాషలో చెప్పు తిక్కవేషాలెయ్యక. సంక్షిప్త వార్తలు ముందు చెప్పు" అని కసిరాడు నారాయణరావు.

"అది కుదరదోయ్! నే చెప్పబోయేది పెద్ద విషయం. లవ్, రొమాన్సు, సైకాలజీ యిత్యాదులన్నీ కలిసివుండేది. చాల తాజా వుదంతం.

"ముకుందంగారంటే యీ వూళ్ళో తెలియని వాళ్ళుండరు. ఆస్తి

వున్న వాడవడం అటుంచి దిట్టమైన లాయరు. మంచి ప్రాక్టీసుంది. రెండు చేతులా సంపాదిస్తున్నాడు. ఇవన్నీ అప్రస్తుతం అనుకోండి. ఆయన భార్య రేవతి అంటే అందానికి మరో పేరు. ఒక్కమాటలో చెప్పాలంటే రంభ, అందాల రాణి. అందంలో ఆమె ముందు నిలవగల స్త్రీలు అరుదు. ఆమె ముకుందం గారికి రెండో సంబంధ మేమోనని చాలా మంది భ్రమపడుతూ వుంటారు. అది నిజంగా భ్రమే. రేవతికి ముప్పయి సంవత్సరాలు పూర్తికావస్తున్నా 20 వత్సరాల సుకుమారిలా వుంటుంది. ముకుందం గారికి నలభై ఏళ్ళుంటాయి. కానీ ఇంకా ఎక్కువ యేళ్ళున్న వాడిలా కన్పిస్తారాయన.

“వీళ్ళిద్దరూ కలిసి వెళుతుంటే అందరి కళ్ళూ వీళ్ళవైపే.... అందులో ముఖ్యంగా ఆమెవైపే....”

విషయం ఏమిటో తేల్చక పోవడంవల్ల సాంబమూర్తికి విసుగు పుట్టింది. “ఒరేయ్ శంకరం! వెధవవర్ణనా నువ్వూను. ఇదేమన్నా పురాణ కాలక్షేపం అనుకున్నావా?.... అసలు ఏం జరిగిందో త్వరత్వరగా చెప్పు” అన్నాడు.

శంకరం అంతగా ఆ మాటలు పట్టించుకోలేదు. “తొందర పడకురా చిట్టి తండ్రీ!.... కట్టె, కొట్టె, తెచ్చె అని మూడు ముక్కల్లో చెప్పేస్తే మీకేం అర్థమవుతుంది?” కొంచెం ఓపిక పట్టండి. అయినా మీరంతా తొందరపడుతున్నారు కాబట్టి, టూకీగా చెప్పేస్తాను. నాకు భలే శ్రోతలు దొరికారురా!.... ఓరి సాంబిగా నీ మూలాన నా మూడ్ కాస్తా పోయింది.... సరే.... ఏ భర్తకైనా కష్టంగానే వుంటుంది— తన భార్యను జనం యావత్తూ గద్దల్లాగా చూస్తుంటే, అందుకని, సామాన్యంగా బయటకు కదలనిచ్చేవాడు కాదు— తప్పనిసరి అయితేతప్ప — ఎప్పుడైనా సినిమాకు తీసుకు వెళ్ళక తప్పేదికాదు. రానురాను ముకుందం గారికి ఇదొక సమస్యగా పరిణమించింది. పోనీ బయటకు వెళ్ళినప్పుడు జనం చూస్తారన్నమాట అటుంచి, ఇంటికి వచ్చిన

పార్టీలు కూడా ఆమె నీడకోసం దిక్కులు చూస్తుంటారు. ఆమెను కళ్ళారా చూద్దామని పార్టీల వెంట వచ్చే వాళ్ళున్నారు. ఈ సమస్యకు పరిష్కారమార్గం అంటూ తోచలేదు అంత గొప్ప లాయరు ముకుందం గారికి. చివరికిది ఏరూపం ధరిస్తుందో వూహించడం కూడా కష్టమై పోయింది ఆయనకు.

"ఎంతోమందిని అంతగా ఆకర్షిస్తున్న ఆమె మనస్సు ఎప్పటికీ తనమీదే లగ్నమై వుంటుందా అన్నదే ఆయన్ని వేధించుకు తింటున్న సందేహం. అన్నివిధాలా ఆమె ఉత్తమురాలే అనుకుంటారు ఒకసారి. ఎమో చెప్పలేం ఏ బుర్రలో ఏ వూహలు తలలెత్తుతాయో అనుకుంటారు ఆయన మరుక్షణంలో!"

శంకరం ఏకధాటిగా చెప్పుకుపోతున్నాడు మిత్రబృందాన్ని సస్పెన్సులో వుంచి. అతని కథనానికి అంతు చిక్కకపోవడంతో సహనం తగ్గింది. వాళ్ళల్లో భూపతికి చిరాకుకూడా పుట్టింది. "ఒరేయ్ బులెటిన్ మహాశయా! కావాలంటే తీరుబడిగా ఒక నవల రాసి మా మొహాన పడేయ్ యివన్నీ వర్ణిస్తూ. కాని, ఇప్పుడు అసలు సంగతేమిటో చెప్పు! నీ సోదికబుర్లు కట్టిపెట్టు" అని కోప్పడ్డాడు.

శంకరం తిరిగి అందుకున్నాడు: "మీతో వచ్చిన చావే యింతరా. అసలు సంగతి చెప్పు చెప్పు అని ప్రాణంతీస్తార్రా. మీకే ఇంటరెస్టు లేకపోతే నాకెందుకు? ఆ విధంగా రోజులు దొర్లుతున్నాయి. ఇక్కడ చాలా విషయాలు, సంఘటనలు వదిలేస్తున్నాను. ముకుందంగారి దగ్గర జూనియర్‌గా చేరిన అవధాని అన్నివిధాలా ఉత్తముడు, గుణవంతుడు. ముఖ్యంగా ముకుందంగారి అభిమానాన్ని చూరగొన్నవాడు. ఆయనకు పనిలో మంచిసహాయం చేస్తున్నాడు. సైకాలజీ దృష్ట్యా అత్యంత ప్రధానమైన అంశాలు - మీ పోరు పడలేక దాటేస్తున్నాను. అవధాని ఉత్తముడన్న నమ్మకం ముకుందంగారికి వున్నా ఆయన మనసులో ఒకమూల అనుమానం చోటుచేసుకుంది. అనుమానానికి ఆధారాలేవీ

లేవు. అవధాని సరాసరి ఆఫీసు గదిలోకి వస్తాడు- పనిచూసుకుంటాడు- వెళ్ళిపోతాడు. అంతే ఇతర ప్రమేయం, అతనికి అక్కర్లేదు. ముకుందం గారు కూడా ఆ గదిలోనే ఆఫీసుపని చూసుకుంటారు. ఆయన అనుమానం అర్థంలేనిదైనా అదిమాత్రం ఆయన్ని వదలడంలేదు. అనుమానం అన్నది చెడ్డవ్యాధి. మామూలు వ్యాధి అయితే శరీరం ఒక్కటే బాధ పడుతుంది. అనుమానం వ్యాధివల్ల మనస్సంతా యమయాతన అనుభ విస్తుంది. ఏమీతోచదు. నిద్రపట్టదు. మనిషిలో ఆవేశం- కోపం పెరుగు తాయ్. రెస్ట్‌లెస్‌గా వుంటాడు. ఇవన్నీ ముకుందంగారిని ఆవహించాయి."

భూపతి ఇదంతా వినలేకపోతున్నాడు. "అయ్యా! పురాణం శాస్త్రుర్లుగారూ!! ఈ ఘట్టం ఎన్నిరోజులు చెప్తారండీ?" హేళనగా అడిగాడు.

శంకరం మూడ్ మార్చుకోకుండా సాగించాడు! "ఇలావుండగా ఒకనాడు ముఖ్యమైన కేసేదోవుంటే అవధాని రోజూ కంటే ముందుగా వచ్చాడు. ముకుందంగారూ పక్కింటాయనా వాకిట్లో కబుర్లు చెప్పు కుంటున్నారు. అవధాని వాళ్ళిద్దరికీ విష్‌చేసి ఆఫీసుగదిలోకి వచ్చి కూర్చున్నాడు. భర్త లోపల కనిపించకపోతే ఆఫీసుగదిలోకి వెళ్ళాడను కుంది రేవతి. కాఫీగ్లాసు పట్టుకొచ్చింది భర్తకోసం. తీరావస్తే భర్తలేడు. అవధాని వున్నాడు. ఇద్దరూ ఒకరివంక ఒకరు క్షణంపాటు చూస్తూ వుండిపోయారు. ఏమి మాట్లాడాలో తోచక అవధాని తెప్పరిల్లి "ఇక్కడికి రాలేదండి వారు. వాకిట్లో మాట్లాడుతున్నారు" అని చెప్పాడు వినయంగా.

"ఎదురుగా పెద్దమనిషి వున్నప్పుడు తెచ్చిన కాఫీగ్లాసు తీసుకు పోవడం సబబనిపించలేదు ఆమెకు. "కాఫీ తీసుకోండి" అని కాఫీగ్లాసు అవధాని టేబుల్‌మీద పెట్టి వెళ్ళిపోబోతోంది. ఇంతలోకే ముకుందం గారు వచ్చారు. ఆమె గతుక్కుమంది. తలవంచుకుని వెళ్ళిపోయింది. ముకుందంగారి గుండెల్లో వెయ్యిశిఖలు భగ్గు భగ్గు మన్నాయి. నౌకరుతో భర్తకు కాఫీ పంపించింది.- తాను తీసుకువెళ్ళడానికి వీలులేదు కాబట్టి.

పెల్లుబుకుతున్న కోపాన్ని, పొగలు గక్కుతున్న కాఫీని కలిపి మింగాడాయన అప్పటికి.

"పగలు అతి కష్టంమీద గడిపి కోర్టు నుంచి తిరిగి వచ్చారు ముకుందం. ఇంటికి వచ్చాక ఆయన అనుమానపు విషవాక్కులతో రేవతి అమాయక హృదయాన్ని వందలాదికాట్లు వేశాడు. ఆమె మనస్సు వ్యథాభరితమై పోయింది. అంత భయంకరమైన కాట్లకు ఆమె తట్టుకోలేక పోయింది. అత్యంతమూ ఆత్మీయుడైన భర్త తన పవిత్ర పాతివ్రత్యానికే నీచంగా కళంకం ఆపాదించినందుకు కుమిలి కుమిలి ఏడ్చింది వేయి మూగకంఠాలతో.

"తెల్లవారుఝామున మూడు గంటలకు ఆమె ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. అంటే వురిపోసుకోబోయిందిట. ఆమె గిలగిలా తన్నుకుంటుండగా పక్కనున్న వస్తువులు కిందపడి చప్పుడవడంతో అంతా లేచి కంఠానికి వేసుకున్న ముడి తప్పించారు. ముకుందంగారు చిన్నబుచ్చుకుని ఏమీ అనలేకపోయారు. తన ఇంగితజ్ఞానాన్ని ఒకమాటు తలచుకుని తన తల నేలలోకి కుంగిపోయినట్లు ఫీలయ్యాడు."

శంకరం హఠాత్తుగా ఆపేశాడు. శ్రద్ధగా వింటున్న మిత్ర బృందానికి అర్థంకాలేదు ఎందు కాపేశాడో. "తర్వాత ఏమయిందిరా?" అని అడిగాడు సాంబమూర్తి.

"ఏమవుతుంది నీ మొహం. అవన్నీ మాటర్స్ ఆఫ్ డిటెయిల్—మీ కెందుకురా అవ్వి. నన్ను నవల వ్రాసుకోమన్నారే.... ఆ వెంటనే అంటే ఈ వుదయం అవధాని ఆయనదగ్గర మానుకుని సొంతంగా ప్రాక్టీసు ప్రారంభించాడు. ఇందాక అవధాని తమ్ముడు నాకు కన్పించి యీ విషయాలు చెప్పాడు. ఈ వార్త వాడివల్ల నాకు చేరిందన్నమాట" అని ముగించాడు శంకరం.

అందరూ అప్రయత్నంగా నిట్టూర్చారు.

"చాల్లేరా అఘోరించావ్! ఇంద్రుళ్లో అసలు చరిత్ర ఎంతో

నీ కల్పనా చాతుర్యం ఎంతో!! పదండిరా కాఫీకి" అని భూపతి మిత్ర బృందాన్ని లేవదీశాడు.

*　　　*　　　*

అనుకున్న ప్రకారం ఆదివారంనాడు ఉమామహేశం బెజవాడ వెళ్ళాడు పెళ్ళిచూపులకోసం. వెంట తల్లీ తండ్రీ కూడా వెళ్ళారు. అన్ని మర్యాదలు జరిగాయి. అమ్మాయి చాలా అందమైంది. ఆమె అందం చూసి ఉమామహేశం ఆశ్చర్యపోయాడు. అంత అందంగల అమ్మాయిని తానింతకు ముందెన్నడూ చూసి వుండలేదనుకున్నాడు. శంకరం చెప్పిన రేవతి యింత అందంగా వుంటుంది కాబోలనుకున్నాడు. పెళ్ళిచూపుల తతంగం అయిపోయింది. ఇంటికివెళ్ళి వుత్తరం రాస్తామని చెప్పి తిరుగుముఖం పట్టారు.

ఇంటికి వచ్చాక ఉమామహేశం వాళ్ళమ్మతో తన అభిమతం వ్యక్తం చేశాడు. గుడివాడ అమ్మాయే తనకు నచ్చిందనీ వాళ్ళకు ఆ సంగతి రాయించమనీ చెప్పాడు. బెజవాడ వాళ్ళకు వేరే సంబంధం చూసుకోమని రాయించమన్నాడు. ఉమామహేశం నిర్ణయం విని యింట్లో అందరూ ఆశ్చర్యపోయారు. అంత రూపవతి అయిన బెజవాడ అమ్మాయి నచ్చకపోవడానికి కారణం తల్లికి బోధపడలేదు. అతని కోరిక ప్రకారం చేయడమే తల్లితండ్రులు ఉద్దేశం. అతని నిర్ణయానికి సరే అన్నారు.

మిత్రబృందం ఉమామహేశం ఒక యింటి వాడవుతున్నందుకు చాల సంతోషించారు. అతని నిర్ణయం కొంత ఆశ్చర్యం కూడా కలుగజేసింది వాళ్లకి.

*

(1961)